సాక్షి నల్లగొండ

ఆదివారం ∙ 30 ∙ జూలై ∙ 2023



ఆర్టీసీలో 'ప్రగతి' పురస్కారాలు

ఆర్టీసీ ఆదాయం పెంపునకు కృషిచేసే సిబ్బందికి ప్రగతి రథచక్ర పురస్కారాలు అందిస్తామని ఆర్ఎం శ్రీదేవి అన్నారు. - 8లో



పుట్టపాకకు ప్రపంచ కీర్తి

చేతన కళా నైపుణ్యంతో దుబీయన్ చీర, తేలియా రుమాల్ నేసిన పుట్టపాక గ్రామ కార్మికులను ప్రపంచమే కీర్తిస్తోంది. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 32° / 25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇద్దరు డీఎస్పీల బదిలీ

నల్లగొండ క్రైం : ఇద్దరు డీఎస్పీలకు శనివారం రాత్రి బదిలీ అయ్యింది. డీసీఆర్‌బీ కార్యాలయంలో ఉన్న రమేష్‌ను ఏసీబీకి బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న సైదాను డీసీఆర్‌బీకి బదిలీ చేస్తూ పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్



బాధ్యతలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నల్లగొండ: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ అయిన ఆయన శుక్రవారం నల్లగొండకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. శనివారం ఆయన విధుల్లో చేరిన అనంతరం మర్యాద పూర్వకంగా కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్‌ను కలిసి పూల మొక్క అందించారు.

100వ రోజుకు చేరిన కిష్టాపురం వాసుల దీక్ష



అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

మునుగోడు: మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం 100వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామస్తులు, అఖిలపక్ష నాయకులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. ఫార్మా కంపెనీ అనుమతులు రద్దుచేసే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు, నందిపాటి వెంకన్న, ఆకుల లింగస్వామి, సింగినేన్ని కనయ్య, మునుకుంట్ల గోపాల్, జాజుల నర్సింహ, సురిగి లింగస్వామి, పంతంగి పరమేష్, మహేశ్వరం వేణు, జాజుల శంకరయ్య, పంతంగి వెంకన్న పాల్గొన్నారు.

భగీరథ కార్మికుల వేతనాలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

మర్రిగూడ: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 60 ప్రకారం కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లం పాండురంగారావు, నాయకులు మల్లేష్, సాయి, శివ,కృష్ణ, శ్రీను, శ్రీకాంత్, నవీన్, బాలు, రాంబాబు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యా పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): అర్హులైన బ్రాహ్మణ విద్యార్థులు వివేకానంద విదేశీ విద్యా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లా వేణు గోపాల్‌రావు కోరారు. శనివారం నల్లగొండ పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 2023–24 విద్యా సంవత్సరానికి గాను విదేశీ విద్యా పథకానికి ఆగస్టు 31వ తేదీ వరకు www.brahmanaparishad.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో అఖిల భారత బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు పులిజాల యాదగిరిరావు, గుండ్లపల్లి వెంకటేశ్వరరావు, ఆకెళ్ల శ్రీనివాస్, విజయకుమార్ శర్మ, ఫణి ఆచార్య, రంగరాజు శ్రీనివాసరావు, మారుతీశర్మ, నవనీత్‌శర్మ, జయప్రద, శ్రీదేవి, మానస పాల్గొన్నారు.

ఆయకట్టులో ఆశలు



నాగార్జున సాగర్ జలాశయం

- తెరుచుకున్న కృష్ణా బేసిన్‌లోని ఎగువ ప్రాజెక్టుల గేట్లు
- జూరాల నుంచి శ్రీశైలానికి పెరుగుతున్న వరద
- త్వరలోనే సాగర్ జలాశయానికి విడుదల కానున్న నీరు
- ఆనందంలో సాగర్, ఏఎమ్మార్పీ ఆయకట్టు రైతులు



ఏఎమ్మార్పీ ఆయకట్టు పరిధిలోని గుర్రంపోడులో పెరిగిన వరినారు

నాగార్జునసాగర్, గుర్రంపోడు: నాగార్జునసాగర్, ఏఎమ్మార్పీ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో భారీ వర్షాలకు కృష్ణానదిపై ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టులు గరిష్ట స్థాయి నీటి మట్టాలకు చేరాయి. దీంతో జూరాల రేడియల్ క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జూరాల నుంచి విద్యుదుత్పాదనతో కలిపి 1.90లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. దీంతో జలవిద్యుత్ ద్వారా సాగర్‌కు నీటిని విడుదల చేయనున్నారు. ఈ దశలో సాగర్, ఏఎమ్మార్పీ ఆయకట్టుకు సాగునీటిని విడుదలపై రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు నిండితే క్రస్ట్ గేట్ల ద్వారా మరింత నీరు సాగర్‌కు చేరుకుంటుంది.

తరలి వస్తున్న కృష్ణమ్మ..

శ్రీశైలం జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 885.00అడుగులు కాగా పదిరోజుల క్రితం 808.00అడుగులు (33.00టీఎంసీల) ఉంది. శనివారం సాయంత్రానికి 838.00 అడుగుల(59టీఎంసీల)కు చేరింది. దీని నీటిమట్టం 850.00 అడుగులకు చేరగానే విద్యుదుత్పాదన ద్వారా సాగర్ జలాశయానికి నీటిని విడుదల చేయనున్నట్లు సమాచారం. గత యేడాది జూలై నెల 23వ తేదీన శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయం నుంచి ఆగస్టు 11న దిగువకు నీటిని వదిలారు. ఎడమ కాల్వ కింద ఆయకట్టుకు జూలై 28న నీటిని విడుదల చేశారు.

ఈ సారి.. వరదను బట్టి..

ఈ సారి ఎగువ నుంచివచ్చే వరదను బట్టి కృష్ణానీటి యాజమాన్యం బోర్డుతో పాటు సాగునీటిశాఖ అధికారులతో ఉన్నతాధికారులు సమావేశమయ్యాక నీటి విడుదలపై తేదీని ప్రకటించనున్నట్లు సమాచారం. నాగార్జునసాగర్ జలాశయం ప్రస్తుత నీటిమట్టం 515.30అడుగులు కాగా 140.8451టీఎంసీలకు సమానం, గరిష్ట స్థాయి నీటిమట్టం 590.00అడుగులు (312.5050 టీఎంసీలు). కుడి కాల్వకు నిత్యం 4,090 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ముందస్తుగా విడుదల చేయాలి

వచ్చే వరద నీటిని బట్టి మొదటి జోన్‌కైనా ముందస్తుగా నీటిని విడుదల చేయాలని సాగర్, ఏఎమ్మార్పీ ఆయకట్టు రైతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఏడాది ముందస్తుగా నీటిని విడుదల చేయాలనే ప్రభుత్వం భావించినప్పటికీ వర్షాలు ఆలస్యం రావడంతో జలాశయాల్లోకి ఇప్పుడిప్పుడే నీరు చేరుతోంది. ఈ నేపథ్యంలో ఆగస్టు వరకు సాగర్ జలాశయం నిండితే వెంటనే కుడి, ఎడమ, ఏఎమ్మార్పీ కాలువలకు నీటి విడుదల చేసే అవకాశం ఉంటుంది.

ఏటా ఆగస్టులోనే ఏఎమ్మార్పీకి..

ప్రతి ఏటా ఆగస్టులో సాగర్ ఎడమ కాల్వకు చేసిన తర్వాతే అధికారులు ఏఎమ్మార్పీకి నీటి విడుదల చేసేవారు. కానీ ఈ సారి ప్రభుత్వం పంట కాలాన్ని ముందుకు జరుపుకోవాలని రైతులకు సూచిస్తున్నందున సరైన సమయంలోనే నీటి విడుదల జరుగుతదనే నమ్మకంతో రైతులు ఉన్నారు. కానీ సాగర్ జలాశయం అడుగంటడడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఎగువ ప్రాజెక్టుల గేట్లు తెరవడం శ్రీశైలం జలాశయంలోకి నీరు చేరుతుండడం.. సాగర్, ఏఎమ్మార్పీ ఆయకట్టు రైతుల ఆశలను సజీవంగా నిలిపింది. అయితే శ్రీశైలం ఎడమ కాల్వకు నీటి విడుదల బట్టి జలవిద్యుత్ ఉత్పత్తి ప్రారంభం నుంచి నీటి లెక్కల్లో ఏఎమ్మార్పీ వాటాగా కేటాయింపులు జరుగుతాయి. దీంతో సాగర్‌లోకి సరిపడా నీరు చేరేంతవరకు వేచి చూసే అవసరమే లేకుండా కాల్వలకు నీటి విడుదల చేసే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు. అయితే ఏఎమ్మార్పీ ఆయకట్టులో హైలెవల్ కెనాల్ కింద 2.20 లక్షల ఎకరాలు, లోలెవల్ కెనాల్ క్రింద 80 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వారం పది రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు బోరుబావుల కింద నాట్లు వేయడంలో రైతుల నిమగ్నమయ్యారు. గత ఏడాది మాదిరిగానే ఆగస్టు రెండో వారంలోనే సాగర్, ఏఎమ్మార్పీ కాల్వలకు నీటి విడుదల జరుగుతుందని రైతాంగం కొండంత ఆశతో ఉంది.

లక్ష్యం చేరని సీఎంఆర్

- ఒకే ఒక్క గోదాము ఉండడంతో సేకరణలో జాప్యం
- స్థలం కొరతతో బియ్యం నిల్వ చేసేందుకు ఇబ్బందులు
- అదనపు గోదాములకు ప్రతిపాదనలు పంపిన అధికారులు



నల్లగొండ: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణ లక్ష్యం చేరుకోవడం లేదు. మిల్లుల నుంచి సేకరించిన బియ్యం నిల్వ చేసేందుకు సరిపడా గోదాములు లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మిల్లుల నుంచి సీఎంఆర్ సేకరించి ఒకే గోదాములో దిగుమతి చేస్తున్నారు. ఈ క్రమంలో లారీల నుంచి బస్తాలు సకాలంలో దిగుమతి కాకపోవడంతో సీఎంఆర్ సేకరణ కూడా ఆలస్యం అవుతుంది. అయితే ప్రభుత్వం ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యం కొనుగోలు చేసి సీఎంఆర్‌కు మిల్లర్లకు అప్పగిస్తుంది. మిల్లర్లు వాటిని మరాడించి బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐకి అప్పగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎఫ్‌సీఐ అధికారులు గతంలో ప్రభుత్వ గోదాముకు తోడు ప్రైవేట్ గోదాములను కూడా అద్దెకు తీసుకుని బియ్యం సేకరించి నిల్వ చేసేవారు. ప్రస్తుతం ప్రైవేట్ గోదాములు తీసుకోవాలంటే టెండర్లు నిర్వహించి తీసుకోవాలనే కొత్త నిబంధన విధించడంతో ఈ సారి ఉన్నఒక్క ఎఫ్‌సీఐ గోదాములోనే దాదాపు 40 మిల్లుల నుంచి వచ్చిన బియ్యాన్ని నిల్వ చేస్తుండడంతో స్థలం కొరత ఏర్పడుతోంది.

గత వానాకాలం సీఎంఆర్ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో..)

మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం	4,44,576
ఎఫ్‌సీఐకి ఇవ్వాలిన బియ్యం	2,98,459
ఇప్పటివరకు ఇచ్చింది	1,85,460
ఇంకా ఇవ్వాల్సింది	1.8లక్షలు
యాసంగికి సంబంధించి..	
మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం	4,70,425
సేకరించిన సీఎంఆర్	36,550

మూడు గోదాములకు ప్రతిపాదనలు..

జిల్లాలో సీఎంఆర్ నిల్వ చేసేందుకు గోదాములు సరిపోకపోవడంతో జిల్లా అధికారులు పెద్దకాపర్తి, మేళ్లదుప్పలపల్లి, కుక్కడం గ్రామాల్లో ఉన్న వేర్‌హౌజింగ్ గోదాములను తీసుకునేందుకు ఎఫ్‌సీఐకి ప్రతిపాదనలు పంపారు. వీటికి అనుమతి వస్తే నకిరేకల్ ప్రాంత మిల్లులను పెద్దకాపర్తి, నల్లగొండకు సంబంధించి వాటిని దుప్పలపల్లికి, హాలియాకు సంబంధించిన బియ్యం కుక్కడంలోని గోదాములకు మళ్లిస్తే త్వరగా సీఎంఆర్ సేకరణ అయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

మూసీకి తగ్గిన వరద ఉధృతి

- నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతి తగ్గింది. దీంతో శనివారం నాలుగు గేట్ల ద్వారా అధికారులు నీటిని దిగువకు వదులుతున్నారు. మూసీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మూసీ ప్రాజెక్టు శుక్రవారం రాత్రి 22,100 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో శనివారం నాటికి 15,360 క్యూసెక్కులకు తగ్గిపోయింది. దీంతో శుక్రవారం రాత్రి తెరిచి ఉంచిన ఎనిమిది క్రస్టు గేట్లలో నాలుగు గేట్లను శనివారం పూర్తిగా మూసి వేశారు. మరో నాలుగు క్రస్టు గేట్లను నాలుగు అడుగుల మేర పైకెత్తి ఉంచి 9,895 క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి వదిలారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 280 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గేట్ల ద్వారా, కాల్వలకు మొత్తం 10,316 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. మూసీ ప్రాజెక్టులో గరిష్ఠ నీటిమట్టం 645(4.46 టీఎంసీలు) కాగా శనివారం సాయంత్రానికి 642 అడుగులుగా ఉందని అధికారులు తెలిపారు.



మూసీ గేట్ల నుంచి దిగువకు పోతున్న నీరు

సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి

- ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

నల్లగొండ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్న ఏకైక సంఘం పీఆర్‌టీయూ టీఎస్ అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని ఆ సంఘం భవన్‌లో జరిగిన మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు విడుదల అయినప్పటికీ కొంతమంది ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్లిన కారణంగా ఆ ప్రక్రియ వాయిదా పడుతూ వస్తుందన్నారు. కోర్టుకెళ్లిన ఉపాధ్యాయులను కలిసి చర్చిస్తామని, వారు సానుకూలంగా స్పందించి పిటిషన్ వెనక్కి తీసుకోకుంటే.. కోర్టు తీర్పు కోసం వేచి చూస్తామని, తీర్పు అనుకూలంగా వస్తే వెంటనే బదిలీలు, పదోన్నతుల కార్యక్రమం చేపట్టేలా చూస్తామన్నారు. సీపీఎస్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు యాత్రకు సంఘం పూర్తి మద్దతును ప్రకటించిందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదులో నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండేలా మండల బాధ్యులు కృషి చేయాలన్నారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాళం నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాసులు, రాష్ట్ర బాధ్యులు కొసనం కరుణాకర్‌రెడ్డి, కొల్లు శ్రీనివాస్‌రెడ్డి, కళావతి, నారాయణ కవిత, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తరాల పరమేశ్ యాదవ్, చిలకరాజు శ్రీనివాస్, వివిధ మండలాల బాధ్యులు యూసుఫ్ పాషా, తిరందాసు సత్తయ్య, నిమ్మనగోటి వెంకటరమణ, దండ రవీందర్‌రెడ్డి, బత్తుల భాస్కర్, బెల్లి కొమరయ్య, సట్టు గోపి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



ఆస్పత్రిలోని ఎంసీహెచ్ వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్, వైద్యశాఖ అధికారులు

- కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్
- జిల్లా కేంద్ర ఆస్పత్రి తనిఖీ



మెడికల్ వార్డులో రోగితో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా కేంద్ర ఆస్పత్రిని తనిఖీ చేశారు. పలు విభాగాలను సందర్శించారు. అనంతరం ఆస్పత్రిలో కలియదిరిగి వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. డయాలిసిస్ యూనిట్‌లో రోగులతో మాట్లాడి మందులు ఇస్తున్నారా అని అడిగారు. పలు విభాగాలను పరిశీలించారు. ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లచ్చునాయక్, జిల్లా డీఎంహెచ్‌ఓ కొండల్ రావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ మాతృ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ వైద్యం.. పేదలకు చేరువ కావాలి

నల్లగొండ:ప్రభుత్వం వైద్యసేవలు పేద ప్రజలకు చేరువయ్యేలా చూడాలని, ఇందుకు ప్రభుత్వ డాక్టర్లు, ప్రోగ్రాం అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ ఆదేశించారు. శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్లతో వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన పీహెచ్‌సీ సబ్ సెంటర్ భవనాల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. వీటి నిర్మాణ పనులను మానిటరింగ్ చేసేందుకు నోడల్ అధికారిని నియమించాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. భ్రూణ హత్యలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు, జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లచ్చునాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ మాతృ, మహిళా, శిశు, సంక్షేమ, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ, సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో బ్యాంకింగ్ సేవలు

గ్రామాల్లో ఆన్‌లైన్ సేవలు విస్తరించాలని ప్రభుత్వ నిర్ణయం

- దరఖాస్తు చేసుకున్న 120 మంది డీలర్లు
- త్వరలోనే శిక్షణ ఇవ్వనున్న యంత్రాంగం
- ఆగస్టులో సేవల ప్రారంభానికి సన్నాహాలు
- గ్రామీణులకు తప్పనున్న ఇక్కట్లు



నల్లగొండ: గ్రామీణ ప్రాంత ప్రజలకు రేషన్ షాపుల ద్వారా బ్యాంకింగ్ సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదివరకు గ్రామీణులు ఆన్‌లైన్ సేవలు పొందాలంటే మండల, పట్టణ కేంద్రాలకు వెళ్లాల్సి రావడంతో నానా ఇబ్బందులు పడేవారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం గ్రామాల్లో ఉండే రేషన్ షాపుల్లో బ్యాంకు సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా పౌరసరఫరాల శాఖ పోస్టాఫీసులతో ఒప్పందం కుదుర్చుకుంది. పోస్టాఫీసులు లేని గ్రామాల్లో మినీ బ్యాంకు తరహాలో ఆన్‌లైన్ సేవలు అందించాలని భావిస్తున్నాయి. ఈ సేవలు ఆగస్టులో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

120 మంది డీలర్ల దరఖాస్తు

జిల్లాలో 844 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో ఎక్కడైతే పోస్టాఫీసులు లేవో ఆ గ్రామాల్లో రేషన్ షాపుల ద్వారా అన్ని ఆన్‌లైన్ సేవలు, చెల్లింపులు జరిగే విధంగా చర్యలు చేపడతారు. ఈ కేంద్రాల నిర్వహణకు ఆసక్తి ఉన్న రేషన్ షాపు డీలర్ల నుంచి ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించారు. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా 120 మంది డీలర్లు ముందుకొచ్చి దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి ఆన్‌లైన్ సేవలు ఏ విధంగా నిర్వహించాలన్న దానిపై జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వాల్సి ఉండగా ఎన్నికల బదిలీలతో కాస్త జాప్యం జరిగింది. త్వరలోనే డీలర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఆగస్టు రెండో వారంలో సేవలు..

ఆగస్టు మొదటి లేదా రెండో వారంలో రేషన్ షాపుల్లో బ్యాంకు సేవలు అందించే అవకాశం ఉంది. రేషన్ షాపుల్లో ఏవిధంగా సేవలందించాలన్న దానిపై డీలర్లకు శిక్షణ ఇవ్వడంతోపాటు తపాలా శాఖ వారు ఆన్‌లైన్ పరికరాలు అందించనున్నారు. దాంతో కంప్యూటర్ లేదా సెల్‌ఫోన్ ద్వారా కాని ఈ ఆన్‌లైన్ సేవలను అందించనున్నారు. అక్కడ అకౌంట్లలో డబ్బులు వేసుకోవడం , తీసుకోవడంతోపాటు ఇతర బిల్లులను కూడా చెల్లించుకునేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణాలకు వెళ్లాల్సిన బాధలు తప్పనున్నాయి. ఈ సేవలు అందించడం ద్వారా ప్రతి సేవకు కొంత రుసుము చెల్లించాల్సి ఉండడంతో రేషన్ డీలర్లకు కూడా అదనపు ఆదాయం చేకూరనుంది.

అదునులో వర్షం.. పత్తి చేలకు జీవం

- అంతటా ఏపుగా పెరిగిన చేలు
- కొనసాగుతున్న కలుపు నివారణ పనులు
- వేధిస్తున్న కూలీల కొరత



హాలియా మండలం వెంకటాద్రిపాలెంలో పత్తి చేనులో గుంటక తోలుతున్న రైతు

సకాలంలోనే వర్షం



"పది రోజులుగా వర్షాలు కురవడంతో ఎండు ముఖం పట్టిన చేలు జీవం పోసుకున్నాయి. కలుపు నివారణకు గుంటుకలు తోలుకుంటూ మందులు పెట్టుకుంటున్నాం. ఇటీవల కురిసిన వర్షాలు పత్తి చేలకు ప్రాణం పోశాయి.

– మారుపాక కొండయ్య రైతు, మర్రిగూడెం, తిప్పర్తి మండలం

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా పది రోజులుగా కురిసిన వర్షాలు పత్తి చేలకు జీవం పోశాయి. గతనెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో పత్తి చేలు వాడు పట్టిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి చేలు ఏపుగా పెరగడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలంలో 6.50లక్షల ఎకరాలలో పత్తి సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనాలు వేశారు. అయితే ఇప్పటి వరకు 5.96లక్షల ఎకరాల్లో రైతులు పత్తిని సాగు చేశారు. పది రోజులుగా అదునైన వర్షాలు కురిసి రెండు రోజులుగా ఒరుపు ఇవ్వడంతో రైతులు పత్తి చేలల్లో సస్యరక్షణ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. గుంటలు తోలుకుని, కలుపును తొలగించుకుంటున్నారు. వరుస వర్షాలతో చీడపీడలు ఆశించకుండా యూరియా, డీఏపీ, పోటాష్ వంటి మందులను పిచికారీ చేస్తున్నారు. అంతటా ఒకేసారి పనులు కొనసాగుతుండడంతో కూలీలత కొరత తీవ్రంగా ఉందని రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు, గుంటూరు జిల్లాలకు చెందిన కూలీలను తీసుకొచ్చి పనులు చేయించుకుంటున్నామని రైతులు పేర్కొంటున్నారు.

ఆ రెండు డివిజన్లలో అత్యధికంగా సాగు

జిల్లాలోప్రధానంగా నల్లగొండ, దేవరకొండ డివిజన్ల పరిధిలో పత్తి పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. ముఖ్యంగా దేవరకొండ, మునుగోడు, చండూరు, నాంపల్లి, చింతపల్లి, గుర్రంపోడు, కనగల్, ఏపీపల్లి, డిండి, నల్లగొండ, హాలియా, నార్కట్‌పల్లి, నకిరేకల్, గట్టుప్పల్ తదితర మండలాల్లోలో పెద్ద ఎత్తున రైతులు పత్తి పంట సాగు చేశారు. గతనెల రోజులుగా వర్షాలు లేని కారణంగా వాడుపట్టిపోయాయి. ఇటీవల ఆవర్తన ద్రోణి కారణంగా జిల్లా అంతటా వర్షం కురిసి పత్తి పంటలు ప్రాణం పోసింది. పది రోజులుగా ముసురుతో కూడిన వర్షం కురిసి శుక్రవారం నుంచి కాస్త ఒరుపు ఇచ్చింది.

భువనగిరిలో మాతం ప్రదర్శన


భువనగిరిలో మాతం ప్రదర్శనలో రక్తం చిందిస్తున్న షియా ముస్లింలు

భువనగిరి : షియా ముస్లిం సంఘం ఆధ్వర్యంలో శనివారం భువనగిరి పట్టణంలో మొహర్రం 10వ రోజు ఆషురాను పురస్కరించుకుని మాతం ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని జంఖానగూడెంలోని హజ్రత్ అబ్బాస్ పీర్ల చావడి నుంచి ఖాజీ మొహల్లాలోని బీబీకా ఆలం వరకు మాతం ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా యువత కత్తులతో ఎదను బాదుకుంటూ మహ్మద్ ప్రవక్త మనువడు ఇమాం హుస్సేన్ బలిదానం స్మరిస్తూ రక్తం చిందించారు. కార్యక్రమంలో షియా ముస్లిం సంఘం భువనగిరి అధ్యక్షుడు సయ్యద్ రజా హుస్సేన్, ప్రధాన కార్యదర్శి కల్బె హుస్సేన్, లయిక్ అలీ, మహ్మద్ హుస్సేన్, అన్వర్ అలీ, రషీద్, అస్గర్, సయ్యద్ అద్నాన్ పాల్గొన్నారు.

B.Tech, MBA, ITI, Polytechnic Diploma, @ Low cost. 9642096424

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా Union Bank of India
(0357), మిర్యాలగూడ బ్రాంచ్ # 10-24 & 25, రాజీవ్ చౌక్ దగ్గర, సాగర్‌రోడ్, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా, తెలంగాణ-508207
ఫోన్ : 08689-231528, 242813, ఇ-మెయిల్: ubin0803570@unionbankofindia.bank

రుణగ్రహీత(ల) న్యాయవారసులకు స్వాధీనతా ప్రకటన
రూల్ 8 (1) మరియు (2) క్రింద (స్థిరాస్తి కోసం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో మరియు చట్టంలోని సెక్షన్ 13 (2)తో చదువబడే సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మిర్యాలగూడ బ్రాంచ్, నల్గొండ జిల్లా యొక్క అధీకృత** అధికారియగు దిగువ సంతకందారు **24.05.2023 తేదీగల** డిమాండ్ నోటీసు జారీ చేసి దిగువ తెలిపిన రుణగ్రహీత : **1. [illegible] భర్త స్వర్గీయ శ్రీ ధనంజయ [illegible]**, ఇం.నం. 19-907, నం.14, నాగార్జున నగర్, సాయిబసప్ప Inn, మిర్యాలగూడ టౌన్ & మం॥, నల్గొండ జిల్లా-508207, ఫోన్ నం.9246966789. **2. [illegible] తండ్రి స్వర్గీయ శ్రీ ధనంజయ [illegible]**, ఇం.నం.19-907, నం.14, నాగార్జున నగర్, సాయిబసప్ప Inn, మిర్యాలగూడ టౌన్ & మం॥, నల్గొండ జిల్లా-508207, ఫోన్ నం.9246966789. **3. [illegible] సత్యనారాయణ తండ్రి స్వర్గీయ శ్రీ ధనంజయ [illegible]**, ఇం.నం.19-907, నం.14, నాగార్జున నగర్, సాయిబసప్ప Inn, మిర్యాలగూడ టౌన్ & మం॥, నల్గొండ జిల్లా-508207, ఫోన్ నం.9246966789. వారిని సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో తెలిపిన మొత్తం **30-04-2023 నాటికి రూ.12,39,026.95/-** (పన్నెండు లక్షల ముప్పయి తొమ్మిది వేల ఇరవై ఆరు రూపాయల తొంభై అయిదు పైసలు మాత్రమే) **01-05-2023 నుండి** వర్తింపుతో భవిష్యత్ వడ్డీ + ఛార్జీలు + ఖర్చులను చెల్లించుటకు కూడా మీరు బాధ్యులై ఉన్నారు.

రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకొని దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **26 జూలై 2023**న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతలకు/గ్యారంటార్‌కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఎలాంటి వ్యవహారం జరుపరాదని మరియు ఆస్తితో జరిపే ఎలాంటి వ్యవహారాలైనా **30-06-2023 నాటికి రూ.12,59,457.95/-** (పన్నెండు లక్షల యాభై తొమ్మిది వేల నాలుగు వందల యాభై ఏడు రూపాయల తొంభై అయిదు పైసలు మాత్రమే) + తిరిగి చెల్లింపులు ఏవైనా జరిపితే వాటిని వర్తింపు విధంగా తగ్గించి తదుపరి వడ్డీ + ఛార్జీలు + దానిపైన ఖర్చుల కోసం **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మిర్యాలగూడ బ్రాంచ్, నల్గొండ జిల్లా వారి** ఛార్జునకు లోబడి ఉంటాయని ముఖ్యంగా రుణగ్రహీతను/గ్యారంటార్‌ను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునేందుకు లభించే సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్‌సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించి, వాటిని దిగువ విధంగా చదువుకోవలెనని రుణగ్రహీతలకు/గ్యారంటార్లకు తెలియజేయడమైనది.

ఆస్తి వివరాలు
1. SRO మిర్యాలగూడ వద్ద నమోదు కాబడిన రిజిస్టర్డ్ **సేల్‌డీడ్ డాక్యుమెంట్ నం.4680/2012 తేది 30-07-2012 ప్రకారం శ్రీ ధనంజయ తండ్రి శ్రీ సత్యనారాయణ కు** చెంది ఉండి నల్గొండ జిల్లా, మిర్యాలగూడ టౌన్ మరియు మం॥, అశోక్‌నగర్, సర్వే నం.840లోని 358 చ.గజాల విస్తీర్ణంతో గల ఓపెన్ ప్లాట్ బేర్ నం.18-1382 (పార్ట్) యావత్తు మరియు **సరిహద్దులు : తూర్పు:**అయ్యప్ప దేవాలయం స్థలం, **పశ్చిమం:**గౌరు నాగార్జున స్థలం, **ఉత్తరం:**జి.ధనంజయ మరియు ఇతరుల స్థలం, **దక్షిణం:**గౌరు నాగార్జున మరియు ఎం.డి.మహమూద్ స్థలం.
2. SRO మిర్యాలగూడ వద్ద నమోదు కాబడిన రిజిస్టర్డ్ **సేల్‌డీడ్ డాక్యుమెంట్ నం.4679/2012 తేది 30-07-2012 ప్రకారం శ్రీ ధనంజయ తండ్రి శ్రీ సత్యనారాయణ కు** చెంది ఉండి నల్గొండ జిల్లా, మిర్యాలగూడ టౌన్ మరియు మం॥, అశోక్‌నగర్, సర్వే నం.840లోని 47 చ.గజాల విస్తీర్ణంతో గల ఓపెన్ ప్లాట్ బేర్ నం.18-1382 (పార్ట్) యావత్తు మరియు **సరిహద్దులు : తూర్పు:**అయ్యప్ప దేవాలయం స్థలం, **పశ్చిమం:**గౌరు నాగార్జున స్థలం, **ఉత్తరం:**30 అడుగుల వెడల్పు రోడ్డు, **దక్షిణం:**గౌరు నాగార్జున స్థలం.

తేది:26.07.2023 సం/- అధీకృత అధికారి SARFAESI
ప్రదేశం:మిర్యాలగూడ చట్టం క్రింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆర్టీసీలో ప్రగతి రథచక్ర పురస్కారాలు

- ఆర్టీసీ నల్లగొండ రీజియన్ మేనేజర్ శ్రీదేవి


మిర్యాలగూడలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లను సన్మానిస్తున్న ఆర్ఎం శ్రీదేవి

మిర్యాలగూడ టౌన్: ఆర్టీసీకి అధిక ఆదాయం సమకూర్చుతూ నిబద్ధతతో పనిచేసే సిబ్బందికి ప్రతినెలా ఒక్కో బస్ డిపో నుంచి 24 మందికి ప్రగతి రథచక్ర పురస్కారాలు అందించనున్నట్టు ఆర్టీసీ నల్లగొండ రీజియన్ మేనేజర్ శ్రీదేవి, డిప్యూటీ ఆర్ఎం శివశంకర్ తెలిపారు. శనివారం మిర్యాలగూడ బస్ డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం జూన్ నెలకు సంబంధించి ప్రగతి రథచక్ర పురస్కారాలు పొందిన కండక్టర్లు నాగలక్ష్మి, ఆర్.అచ్చాలి, రామలింగేశ్వరి, స్రవంతి, బీవై.కోటయ్య, రోశయ్య, చంద్రయ్య, పీఎం రావు, డ్రైవర్లు ఎంజే.రెడ్డి, ఆర్‌పీసీ.రెడ్డి, సైదయ్య, జనార్దన్, మోహిజుద్దీన్, మెకానిక్‌లు రవి, శ్రామిక్ తిరుపతయ్య, చాంప్లాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్ఎం శ్రీదేవి మాట్లాడుతూ ఆర్టీసీ డిపోల్లో పనిచేసే డ్రైవర్స్, కండక్టర్లు, మెకానికల్‌లు, హెల్పర్లు, ఆర్టిజన్లకు ప్రతినెలా ఈ పురస్కారాలు అందుతాయన్నారు. డిపోకు మంచి ఆదాయం తీసుకొచ్చేందుకు కృషిచేస్తూ, ప్రయాణికుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా విధులు నిర్వహించే వారికి మాత్రమే ఈ పురస్కారాలు అందిస్తామన్నారు. ప్రతి డిపో నుంచి 24మందికి ప్రతినెలతోపాటు ప్రతి మూడు నెలలకు ఒక్కసారి రీజియన్ స్థాయిలో, ఏడాదికోసారి రాష్ట్ర స్థాయిలో ఈ ప్రగతి రథచక్ర పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు. డిపోలకు మంచి ఆదాయాన్ని తీసుకొచ్చి నల్లగొండ రీజియన్‌ను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులు, మెకానికల్‌లు, కార్మికులంతా సమన్వయంతో కృషి చేయాలన్నారు. పట్టుదలతో పనిచేస్తే ప్రతి ఒక్కరికీ ఈ పురస్కారాలు అందుతాయన్నారు. అదేవిధంగా ఆర్టీసీ సంస్థ ఎండీ సజ్జనార్ ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన టీ-9, టీ-30 టికెట్లపై కూడా ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్, అసిస్టెంట్ డిపో మేనేజర్ సంధ్యారాణి, ఎంఎఫ్ యాదగిరి, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల్లో ఆర్టీసీని గుర్తించలేదు

- ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి

యాదగిరిగుట్ట : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని గుర్తించలేదని ఆ సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు – ఆర్టీసీ, కార్మికుల పరిస్థితి అనే అంశంపై సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వివిధ పార్టీలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీకే రాష్ట్ర ప్రభుత్వం రూ.3,400 కోట్ల అప్పుగా ఉందని పేర్కొన్నారు. ఆర్టీసీని రక్షించుకోవాలంటే అన్ని పార్టీల నాయకులు, ప్రజలు కలిసికట్టుగా ప్రభుత్వంపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీలో గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గోదా శ్రీరాములు, ఎండీ జహంగీర్‌లు మాట్లాడుతూ యాదగిరిగుట్ట బస్సు డిపో, బస్టాండ్‌ను తరలించే ఆలోచనను విరమించుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో ఆయా పార్టీల, సంఘాల నాయకులు రాచకొండ జనార్దన్, గోరేటి రాములు, ఎండీ ఇమ్రాన్, కల్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, చెక్క వెంకటేష్, కొండమడుగు నరసింహ, బబ్బూరి పోశెట్టి, ఈశ్వర్ రెడ్డి, బంధారపు భిక్షపతి, ఆకుల గణేష్, జగదీష్, కురిమిద్ధ మల్లయ్య, పేరబోయిన మహేందర్, పేరబోయిన పెంటయ్య, గనబోయిన వెంకటేష్, సామల శోభన్ బాబు, దాసరి లక్ష్మయ్య, పుష్ప, మూసుకుంట్ల నర్సమ్మ పాల్గొన్నారు.

పుట్టపాకకు ప్రపంచ కీర్తి

- చేనేత కళా నైపుణ్యంలో సిద్ధహస్తులు ఈ ఊరి నేతన్నలు
- చేనేతలో తొలి పద్మశ్రీ అవార్డు పుట్టపాక సొంతం
- ఫ్రాన్స్ ప్రథమ మహిళకు ప్రధాని మోదీ బహూకరించిన దుబీయన్ చీర ఇక్కడిదే..
- ఖండాంతరాలకు పుట్టపాక చేనేతల ఖ్యాతి

సండే స్పెషల్


ఫ్రాన్స్ అధ్యక్షుడి భార్యకు బహుమానం అందజేస్తున్న ప్రధాని మోదీ (ఫైల్)


ఫ్రాన్స్ అధ్యక్షుడి భార్యకు భారత ప్రధాని నరేంద్రమోదీ అందజేసిన దుబీయన్ చీర (ఫైల్)

అదో చిన్న గ్రామం.. 4,550 మంది జనాభా.. వారిలో సుమారు మూడు వేల మందికి చేనేతే ఆధారం. 657 మగ్గాలతో ప్రతి ధారం పోగును కలిపి వస్త్రం నేస్తూ వినూత్న ఆలోచనలకు రూపమిస్తున్నారు యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక చేనేత కార్మికులు. తమ చేనేత కళా నైపుణ్యంతో ఆ ఊరి కీర్తిని ఇప్పుడు ప్రపంచానికి చాటారు. దుబీయన్, తేలియా రుమాల్ వస్త్రం నేయడం వీరి ప్రత్యేకత. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ఆ దేశ అధ్యక్షుడి భార్య బ్రిగిట్టే మెక్రాన్‌కు దుబీయన్ చీరను బహూకరించడంతో పుట్టపాక ఖ్యాతి ఖండాంతరాలకు చేరింది.

– నల్లగొండ డెస్క్



దుబీయన్ చీర

గుర్తింపుతో నూతన ఉత్సాహం..



పుట్టపాక చేనేత కళాకారులు నిరంతరం తమ ప్రతిభను చాటుతున్నారు. తేలియా రుమాల్ అనే వస్త్రంతో నూతన డిజైన్లు ఆవిష్కరిస్తున్నారు. ఇక్కడి వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. ప్రముఖులకు ఇక్కడి వస్త్రాలను బహూకరిస్తుంటారు. గుర్తింపు లభించినప్పుడు నూతన ఉత్సాహంతో మరింత ఎక్కువగా పనిచేస్తున్నారు. కార్మికులకు నా వంతు సహకారం అందిస్తున్నా.

– గజం గోవర్ధన్, పద్మశ్రీ అవార్డు తొలి గ్రహీత

ప్రభుత్వం ప్రోత్సహించాలి



చేనేత కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. మేము సృజనాత్మకంగా అనేక డిజైన్లతో వస్త్రాలు తయారు చేస్తుండడంతో అవార్డులు, గుర్తింపు వస్తున్నాయి. వస్త్రాలు అమ్మడానికి పట్టణాల్లో స్టాల్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం అందించాలి. ఎగ్జిబిషన్లు నిర్వహించినప్పుడు ఆర్థికంగా ప్రోత్సాహం లభిస్తుంది.

– గూడ శ్రీను, చేనేత కళాకారుడు, జాతీయ అవార్డు గ్రహీత

చేనేత వస్త్రాల తయారీ ప్రయోగశాల పుట్టపాక. ఇక్కడి చేనేత కార్మికులు కళా నైపుణ్యానికి పదును పెడుతూ, సృజనాత్మకతను వెలికి తీస్తూ, పోటీతత్వంతో అనేక కొత్త డిజైన్లను రూపొందిస్తుంటారు. నూతన ఒరవడి సృష్టించడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. తేలియా రుమాల్, దుబీయన్ వస్త్రం తయారీ, నిలువు ధారంపై డిజైన్‌లు చేసి రంగులు అద్దడం ఇక్కడి కళాకారుల ప్రతిభకు నిదర్శనం. ప్రజల అభిరుచికి తగినట్లుగా వస్త్రాలు రూపొందించడంలో వీరు దిట్ట. చేనేత కళా రంగానికి తొలి పద్మశ్రీ అవార్డు వచ్చింది పుట్టపాక గ్రామ చేనేత కళాకారులకే. వీరి కళా నైపుణ్యానికి రెండు పద్మశ్రీ అవార్డులు వరించాయి. మరెన్నో జాతీయ అవార్డులు ఈ గ్రామ చేనేత కార్మికుల సొంతం. డబుల్ ఇక్కత్ తేలియా రుమాల్ వస్త్రంతో పుట్టపాకకు ప్రపంచ గుర్తింపు వచ్చింది.

ప్రాచీన కళ తేలియా రుమాలు వస్త్రం..

పుట్టపాకకు చెందిన గజం నర్సింహ ప్రాచీన తేలియా రుమాలు వస్త్రాన్ని వెలుగులోకి తెచ్చారు. దీని తయారీ కోసం నూలును 21 రోజుల పాటు ప్రాసెస్ చేస్తారు. ఆ తర్వాత వస్త్రం అవసరాన్ని బట్టి వార్పుపై అవసరమైనంత పొడవులో దారాలను తీస్తారు. మగ్గంపై కావాల్సిన తీరులో డిజైన్లతో కూడిన వస్త్రాన్ని రూపొందిస్తారు. ఇలా తేలియా రుమాలు వస్త్రంతో తలపాగాలు, చీరలు, దుపట్టాలతో పాటు ఇతర దుస్తులను తయారు చేస్తున్నారు. ఇవి ఎండాకాలం చల్లగా, చలికాలం వెచ్చగా ఉండడమే కాక సుగంధ వాసనలు వెదజల్లుతాయి. ఇలా తయారు చేసే చీరలు డిజైన్లను బట్టి రూ.30 వేల నుంచి రూ.2 లక్షల ధర పలుకుతున్నాయి. ఒక చీర నేయడానికి మూడు నెలల సమయం పడుతుంది. ఇక్కడి తేలియా రుమాల్ వస్త్రాలు ముంబయి, సోలాపూర్, కోల్‌కతా, చెన్నై, గుజరాత్, బెంగళూరులతో పాటు సింగపూర్, అమెరికా, జర్మనీ, జపాన్, నెదర్లాండ్, అరబ్ దేశాలకు ఎగుమతి అవుతుంటాయి.


2013 సంవత్సరంలో పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న గజం అంజయ్య


రాట్నంపై దారం చుడుతున్న చేనేత కార్మికురాలు

పుట్టపాక ప్రత్యేకం.. దుబీయన్ వస్త్రం

దుబీయన్ వస్త్రం డిజైన్ దేశంలో ఎక్కడా కనిపించదు. కేవలం పుట్టపాకలోని చేనేత కళాకారులు మాత్రమే దుబీయన్ వస్త్రం నేస్తారు. ఈ వస్త్రం తయారీలో నిలువు ఇక్కత్ (వార్పుపై పొడుగు దారం) విధానం పాటిస్తారు. అదే విధంగా డిజైన్ కూడా నిలువు ఇక్కత్‌లోనే రూపొందిస్తారు. ఈ వస్త్రం తయారీకి వాడే దారాలు కూడా పలుచగా ఉంటాయి. దుబీయన్ వస్త్రంతో చీరలు, ఫ్యాబ్రిక్ దుస్తులు తయారు చేస్తారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రథమ మహిళ బ్రిగిట్టే మెక్రాన్‌కు పుట్టపాకలో చేనేత కళాకారులు తయారు చేసిన దుబీయన్ సిల్క్ చీరను చందనం పెట్టెలో పెట్టి బహూకరించారు.

కట్టుకున్నోడే కాలయముడు!

- భార్య లహరిని అతి కిరాతంగా కొట్టి చంపిన భర్త వల్లభ్‌రెడ్డి
- ప్రాథమిక పోస్టుమార్టం నివేదికలో వైద్యుల వెల్లడి
- పొత్తికడుపులో తన్ని, తల, వీపుపై బలంగా కొట్టడమే మృతికి కారణం
- వల్లభ్‌రెడ్డిని అరెస్టు చేయొద్దని ప్రజాప్రతినిధుల నుంచి పోలీసులకు ఒత్తిళ్లు
- ఇన్సూరెన్స్ కూడా ఓ కారణం కావొచ్చని పోలీసుల అనుమానం

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): ఇటీవల మరణించిన లహరిరెడ్డి గుండెపోటుతో చనిపోలేదని, ఆమెను అత్యంత కిరాతకంగా కొట్టడం, గాయపరచడం కారణంగానే మృతిచెందిందని వైద్యులు ఇచ్చిన పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడైంది. ఈ కేసులో మొదటనుంచీ అనుమానాస్పదంగా ఉన్న నల్లగొండకు చెందిన కాంగ్రెస్ నేత కుమారుడు, భర్త వల్లభ్‌రెడ్డిని హైదరాబాద్ నారాయణగూడ పోలీసులు ఈనెల 26న అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఓ పక్క వైద్యులు ఇచ్చిన పోస్టుమార్టం రిపోర్టులో అనేక కీలకమైన విషయాలు బహిర్గతం కాగా, మరో పక్క తమకు ఎవరిపై అనుమానాలు లేవని మృతురాలి తండ్రి బహిరంగంగా వెల్లడించడం పలు చర్చలకు దారితీస్తోంది. తాము పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేసి వల్లభ్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు నారాయణగూడ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్ వెల్లడించారు.

పొత్తికడుపులో తన్నడం వల్లే..

గత ఏడాది వల్లభ్‌రెడ్డి–లహరిలకు వివాహమైంది. అప్పటి నుంచీ వీరిద్దరి మధ్య సంతానం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 14న ఉదయం కూడా వారిద్దరి మధ్య చిన్నపాటి వాగ్వాదం జరిగింది. అప్పటికే లహరిపై ఆగ్రహంతో ఉన్న వల్లభ్‌రెడ్డి ఆమెను దారుణంగా కొట్టాడు. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను హైదర్‌గూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా..అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇటీవల వైద్యులు ఇచ్చిన ప్రాథమిక పోస్టుమార్టం రిపోర్టులో ఆమెపై దారుణంగా దాడి జరిగిందని స్పష్టంగా వెల్లడైంది. దీంతో మూడు రోజుల క్రితం వల్లభ్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు.

అరెస్టు చేయొద్దంటూ ఒత్తిళ్లు

వైద్యులు ఇచ్చిన పోస్టుమార్టం నివేదిక ఆధారంగా పోలీసులు నల్లగొండ జిల్లాలో వల్లభ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్ అఫ్జల్‌గంజ్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. దీంతో నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పెద్దలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, కార్పొరేటర్‌లు అతన్ని అరెస్టు చేయొద్దంటూ పోలీసులపై ఒత్తిడి తెచ్చారు. ఈనెల 26న ఉదయం 8గంటలకే ఒక ఎమ్మెల్యే నారాయణగూడ పోలీసు స్టేషన్‌కు వచ్చి వల్లభ్‌రెడ్డిని అరెస్టు చేయొద్దంటూ హుకుం జారీ చేయడం గమనార్హం. మరో పక్క ఈ హత్యకు లహరి పేరుపై ఉన్న కోట్లాది రూపాయిల ఇన్సూరెన్స్ కూడా ఒక కారణం కావొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఫిట్స్ రావడం వల్లే దెబ్బలు తగిలాయి

మా కుమార్తెకు ఆ రోజు ఫిట్స్ వచ్చి కిందపడింది. అందువల్లే ఆమెకు దెబ్బలు తగిలాయి. మాకు ఎవరిపైనా ఏవిధమైన అనుమానాలు లేవు. పోలీసులు, వైద్యులు ఏవేవో ఊహించుకుంటూ బయటపెట్టడం, దానిని మీడియా వక్రీకరించడం సరైంది కాదు. పోలీసుల తీరుపై ఇప్పటికే హైదరాబాద్ సీపీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాను. మా వల్లే వల్లభ్‌రెడ్డి కుటుంబానికి చెడ్డపేరు వస్తోంది.

– జైపాల్‌రెడ్డి, లహరి తండ్రి

మాపై రాజకీయ కుట్ర

మాపై కొందరు రాజకీయ కుట్రకు తెరలేపారు. మా కోడలు లహరి మాతో చాలా మంచిగా ఉండేది. ఆమె కిందపడటం వల్లే గాయాలయ్యాయి. పోస్టుమార్టం రిపోర్టులో ఏముందో మాకు తెలియదు, కోర్టులో మాకు న్యాయం జరుగుతుంది.

– యదవల్లి రంగసాయిరెడ్డి, వల్లభ్‌రెడ్డి తండ్రి

ఎన్‌టీసీఏ అవార్డు అందుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

చందంపేట : అటవీ శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను నల్లగొండ జిల్లా చందంపేట మండలం కంబాలపల్లి బీట్ ఆఫీసర్ ఎ.కవిత శనివారం ఉత్తరాఖండ్‌లో కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అటవీ శాఖలో ఉత్తమ సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం నేషనల్ టైగర్ కన్సర్వేషన్ అథారిటీ(ఎన్‌టీసీఏ) ఆధ్వర్యంలో అందించే అవార్డును అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో మొట్టమొదటి సారిగా కంబాలపల్లి బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎ.కవిత అందుకోవడం విశేషం. గ్లోబల్ టైగర్ డేను పురస్కరించుకొని శనివారం ఈ అవార్డును కవితకు ప్రదానం చేశారు.


కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కవిత

అధిక వర్షాలకు పంటలను కాపాడుకోండి ఇలా..

- కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త ఆదర్శ్ సూచనలు


ఆదర్శ్, శాస్త్రవేత్త

గరిడేపల్లి : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు దెబ్బతిన్నాయి. వర్షాలు తగ్గిన వెంటనే రైతులు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త ఆదర్శ్ వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

పత్తిలో తెగుళ్ల నివారణకు..

- అధిక వర్షాలకు పత్తి మొక్కలు పసుపు, ఎరుపు రంగుల్లోకి మారే అవకాశం ఉంది. దీని నివారించాడానికి మొక్క వయసును బట్టి 10గ్రాముల పొటాషియం నైట్రేట్(13:00:45) లేదా (19.19.19) పది గ్రాముల లీటర్ల నీటిలో కలిపి పొలం అంతా పిచికారీ చేయాలి.
- పత్తి పంట ఎదుగుదలకు వర్షాలు తగ్గిన వెంటనే రైతులు 25కిలోల యూరియా, 10కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు ఐదు సెంటి మీటర్ల దూరంలో వేసుకోవాలి.
- నేలల్లో అధిక తేమ ఉండటం వలన పత్తి మొక్కలకు వేరుకుళ్లు, కాండం కుళ్లు వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు మొదటగా 5 మి.లీ ట్రైకోడర్మ విరిడి లేదా 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండజిమ్ లేదా రిడోమిల్ గోల్డ్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి ఆ ద్రవాన్ని తెగులు ఆశించిన మొక్కల పాదుల చుట్టూ నేలపై వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పోసుకోవాలి. తద్వారా కుళ్లురోగాలను త్వరగా నివారించుకోవచ్చు.
- అధిక తేమ ఉండటం వలన పత్తిలో రసం పీల్చే పురుగులు పచ్చ దోమ, తెల్ల దోమ, తామర పురుగులు, పేను బంక ఆశించడం గమనించవచ్చు. రైతులు, వాటి లక్షణాలు గమనించినచో నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లీటర్లు లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా అసిఫేట్ 1.5 మి.లీ లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.


పెన్‌పహాడ్‌లో పత్తి రైతులకు నీటి నిల్వలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త లవకుమార్ (ఫైల్)


పెన్‌పహాడ్ మండలంలో పత్తి చేనులో నిలిచిన నీరు

పాడి పంట

వరి చేలల్లో..

- వరి నారు మడిలో మురుగునీరు కాలువల ద్వారా తీసివేసిన తర్వాత నారు మడిని పూర్తిగా ఆరనివ్వాలి.
- వర్షాలు తగ్గిన తరువాత నారు ఎర్రబడితే నివారణకు ఎకరాకు 19:19:19, 10 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- వర్షపునీటిని సరైన సమయంలో తిసివేయకుంటే నారు కుళ్లిపోయి చనిపోవడానికి ఆస్కారం ఉంటుంది. రైతులు వర్షపు నీటిని తీసివేసి కుళ్లిన లక్షణాలు ఉంటే 5 మి.లీ ట్రైకోడర్మ విరిడి లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు మొక్క పాదల్లో పోసుకోవాలి.
- ప్రస్తుత వాతావరణంలో వరిలో అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు మాన్కోజెబ్+కార్బండజిమ్ 2గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకొని పంటలను కాపాడుకోవాలి.
- ఆకులను తినే శనగ పచ్చ పురుగు గమనిస్తే నోవల్యూరాన్ 1 మి.లీ, లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ లేదా ఫ్లుబెండమైడ్ 0.2 గ్రాములు లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేసుకోవాలి.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

FOR SALE
- నల్లగొండ పట్టణంలో 6,000 నుంచి 20,000 ల వరకు ప్లాట్లు, 12 లక్షల నుంచి 60 లక్షల వరకు ఇండ్లు, వ్యవసాయ భూములు అమ్మబడును, కొనబడును. సంప్ర॥ 9160420536 [Y-772541]

HOUSE FOR SALE
- కోదాడ నయానగర్‌లో 221 చ॥గజాలలో నూతనంగా నిర్మించబడిన డబుల్ బెడ్‌రూం ఇల్లు అమ్మకానికి కలదు. సంప్ర॥ 9966664245, 9542289507 [Y-784376]

VILLAS FOR SALE
- Best Gated Community In Nalgonda District, Superb Villas Reasonable Priced Must See, Fully Ready. Contact :9440467666 [H-788553]
- Ready to Occupy Duplex Luxury Villas in the Best Gated Community at Miryalaguda, Next to New Dmart, Club House, Swimmingpool, Fully Operational Must See Call: 7013578378 [H-788552]

Services

CHANGE OF DATE OF BIRTH
- I, Jagannadham kuna, Army Personnel serving at 31(T) Bn NCC, (Parent Unit 2 Madras) H.No.6-5-158/1, Ravindra Nagar, Near Shivaji Nagar Centre, Nalgonda-508001 stating that my wife date of birth was wrongly entered as 15 May 1991 instead of 24 Aug 1995 in all Army Service documents. Correct date of birth is 24 Aug 1995. [YA-1618]

BUSINESS OFFER
- ద్వారకా ఎంటర్‌ప్రైజెస్ పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్ : 9310515624, 8800496710 [DA-38443]
- Software_Company_Franchise Less Investment & High Profit. www.wilcosolutions.com Ph: 9502650550. [WB-18788]

Wanted
- శ్రీ విఘ్నేశ్వర హోండా నల్లగొండ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, స్పేర్ పార్ట్స్ ఎగ్జిక్యూటివ్ (F), కంప్యూటర్ ఆపరేటర్, సర్వీస్ సూపర్‌వైజర్స్ & నార్కట్‌పల్లి యందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర॥ 9290053788, 9290143623 [Y-798242]
- Brand Events Organisation నల్లగొండలో పనిచేయుటకు పర్మినెంట్ లేడీ ప్రమోటర్స్ కావలెను. (5 to 6 Hours) జీతం : 6.5 k To 7K సెల్ : 7815904638 / 39 [Y-1146149]
- షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము, హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, వార్డ్ బాయ్స్, భార్యాభర్తలు డ్రైవర్స్ కావలెను. ఫోన్ : 9391086931, 9246585901 [HA-11711]
- పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-788737]
- నల్గొండ పట్టణంలో ప్రముఖ ఆయుర్వేదిక్ షాపులో పనిచేయుటకు మహిళా ఉద్యోగి కావలెను, విద్యార్హతతో పనిలేదు వివేకంతో మాట్లాడే వారికి ప్రాధాన్యత. ఫోన్ : 9121467219 [H-788511]
- Urgent Requirement of experienced Marketing and Sales reps to promote educational products to schools for Telangana and AP. Good Pay offered. Contact:9177979911,9502842233, hr@scolaire.in [HA-1745]

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లలో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. :220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
నల్గొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.